# 29. జారేకాళ్ళు

అది కలమాత్రం కాదు. తను జీవితాంతం వరకూ నమ్మిన భర్త... తనను ఎంతో గాఢంగా ప్రేమించాడని భ్రమపడే వ్యక్తి.,... పొరుగింటి వరలక్ష్మితో రాత్రులు గడుపుతూన్నట్టు ప్రత్యక్షంగా చూశాక... తను నమ్మకుండా ఎలా ఉండటం?

జరిగిన విషయాలు అనేకం ఆమెకు జ్ఞాపక మొచ్చినై. తనతోడి స్నేహమనే వంక మీద వరలక్ష్మి రోజూ తన యింటికి రావటం, తను ఆమెను నమ్మి భర్త యెదుటకూడా ఆమెతో స్వేచ్ఛగా మాట్లాడటం, ముగ్గురూ కలిసి కబుర్లు చెప్పుకుంటూ నవ్వటం... ఇదంతా తన కాపరానికి మోసంతెస్తుందని తను అనుమానించకపోవటం... రూఢిపడ్డ యీ విషయాన్ని తలచుకొని ఇప్పుడు బాధపడటం మొదలైనవన్నీ ఆమెను దుఃఖింపజేశాయి. తనలో ఏం లోపముందని భర్త పరస్త్రీ కోసం చెయ్యిజాపాలి? తన దర్శనంకోసం ఒకటికి పదిసార్లు రోజూ సాయంత్రం ఆ వీధి వెంట తిరిగే యువకులే తన సౌందర్యాన్ని చాటుతున్నారు. కిందటి సంవత్సరం, తను కన్పిస్తేనే చాల్ననే ఉద్దేశంతో, అద్దెచాలా ఎక్కువైనా పక్కింటి మేడమీది గదితీసుకొన్న విద్యార్థులు తనకోసం ఒకళ్ళకు తెలియకుండా ఒకళ్ళు విశ్వప్రయత్నం చేసి చివరకు తనచేత నవ్వించటం కూడా చేతకాక తోకముడిచిన విషయాన్ని తనెల్లా మరచిపోగలదు? ఆ సమయంలో తనేమైనా చలించిందా? భర్తకు ద్రోహం చేయాలనుకుంటే ఎంతలోపని? మూడు సంవత్సరాల్నుంచీ కాపరం చేస్తూన్నా యీ భర్తకు యిదేం దుర్బుద్ధి? తన వల్ల ఏ అసంతృప్తీ కలగకపోయినా భార్య అనే గోడను అడ్డం పెట్టుకొని 'చెడుప్రవర్తన' అనే పేరు రాకుండా విహరించేందుకేనా యీ పెళ్ళి చేసుకుంది? పోనీ తనవల్ల ఏమైనా తప్పుంటే చెప్పకూడదూ? ఛీ... అందుకనే మొగాళ్ళను నమ్మకూడదన్నారు.

పోనీ భర్తను నిలవదీసి ఇవన్నీ అడుగుతే? తలాయించి సమాధానం చెప్తాడు. అతను భార్యకు భయపడే భర్త అయితేగా? అన్ని విధాలా స్వాతంత్ర్యాన్ని సంపాయించుకు కూర్చొని, తనను నమ్మిన భార్య ఎక్కడికి పోతుందనే ధీమాగల వ్యక్తికి తనంటే ఏం లెక్క? ఒకవేళ ఒకవిధంగా తన తప్పును ఒప్పుకొని...ఇకముందు ఆ తప్పును చెయ్యనని కల్లబొల్లి వాగ్దానాలు చేసినా... ముందు తన కళ్ళుపడేట్టు ప్రవర్తిస్తేగా... తను పట్టుకోగలిగేది? ఇన్నాళూ తను ఎరుగని తావుల్లో తన ఊహ చొరని ప్రదేశాలలో ఆ పని చేస్తే తనేం గ్రహించగలిగింది? కుక్కతోకలాటి మానవ ప్రకృతిని తనెల్లా విశ్వసించగలదు?

తలుచుకొన్నకొద్దీ ఆమె ప్రతీ అవయవమూ వొణికింది. ఒళ్ళు మండింది. భరించలేని బాధంతా కన్నీళ్ళరూపాన వెలువడి... తలగడా తడవటంగా మారింది. ఆ పని చెయ్యకుండా ఉండేందుకు శిక్షాస్మృతి తన చేతులలోనే ఉంటేనా? తనలాటి సద్వంశకు యీ ఇల్లు యిక ముందు నివాసయోగ్యం కాదేమో? కాదు, ఇదే నిశ్చితాభిప్రాయం. అంతకన్న తను చెయ్యగలిగింది కూడా లేదేమో?

కాళ్ళ చప్పుడు విని కళ్ళనీళ్ళు తుడుచుకుంది. భర్తవచ్చి, తనేమీ ఎరగనట్టే రెండో మంచం మీద పడుకున్నాడు. తన వైపైనా చూడలేదు. అతని వాలకం భరించరానిదైంది.

గట్టిగా దగ్గింది. భాస్కరం ఆమె వైపుతిరిగి, “నువ్వింకా నిద్రపోనేలేదా?” అన్నాడు.

“ఆ.. పిల్లి కళ్ళుమూసుకొని పాలు తాగుతూంటే...” అంది పొడిగొంతుకతో.

“నీ మాటల ధోరణి అర్థమవటంలేదు” అన్నాడు ఆమె కోపాన్ని గుర్తించి.

తన హృదయంలోని బరువైన మాటల్ని భర్త ముందు పడేసి, కొంత బాధను తగ్గించుకోవాలనుకుంది. కాని అందుకు ఆమె అభిమానం అడ్డుపడి, ‘చెప్పి మాత్రం ఏం లాభం?’ అని బోధించింది.

“నేను రేపు వెళ్ళిపోతాను...”

“ఎక్కడికి?”

“పుట్టింటికి.”

“ఎందుకనీ?”

“నా యిష్టం...” తనను లెక్కచెయ్యని భర్తకు ఏ కారణాల్నీ చెప్పక, ఇలాటి తలబిరుసు సమాధానాల్తో అతని మనస్సు నొప్పించటం ఆమెకు తృప్తిగా తోచింది.

భాస్కరం కనుబొమల్ని చిట్లించి, “కారణం యేమీ లేదన్నమాట” అన్నాడు.

“ఊహు.”

"అంత కోపంగా ఉన్నావ్ దేనికి?"

"ఏమీ లేదు... రేపు వెళ్తాను."

"కారణం?"

"ఏమీ లేదు... నేను వెళ్ళాలి..అవసరం కనుక" ఇంకా సంభాషణను పొడిగించటం కూడా ఆమెకు అనవసరంగా తోచింది.

తరువాత భాస్కరం ఎంతో బతిమాలుతూ ఆమెను కారణమడిగాడు. ఆమె చెప్పలేదు... భర్త మీది కోపం ఆమె పుట్టింట్లో కాలుపెట్టేదాకా పోలేదనే చెప్పాలి.

❋ ❋ ❋

ఇప్పుడు తన భర్త ఏంచేస్తూంటాడు? తను లేని యీ నెలరోజులూ జీవితంలో వృథా అయినయ్యని విచారిస్తూంటాడా? లేక తనులేనిదే పదివేలుగా భావించి, తనిచ్చే ఆనందాన్నే ఆ వరలక్ష్మితో అనుభవిస్తూ, ఊరేగుతుంటాడా? ఇంతవరకూ భర్త తనకు ఒక్క ఉత్తరమన్నా రాయక పోవటమే అతను తనను లెక్కచెయ్యలేదనే అభిప్రాయాన్ని నిరూపిస్తోంది.

తనకన్న తక్కువ అందగత్తయిన వరలక్ష్మితో- తన వాడనుకొన్న భర్త, తన ఇంట్లో స్వేచ్ఛగా విహరించటాన్ని ఆమె ఊహించుకుంది. అదంతా తన ఎదుటనే జరుగుతూన్నట్టు భావించి కంపించింది- కాస్త ఆలోచించి ఆ విషయాన్ని తలచుకోవటమే గొప్పతప్పేమో ననుకుంది...

"ఏమిటీ దీర్ఘాలోచనలో ఉన్నావ్?"

శ్రీధరాన్ని చూసి లేని చిరునవ్వును పురస్కరించుచుకుంటూ "ఏమీలేదు... ఏమీ తోచటంలేదు..." అంది.

"భర్త దగ్గర లేకపోతే... కాపరాలు చేసేవాళ్ళకు ఏం తోస్తుందిలే."

ఎంత ధైర్యంగా అన్నాడు! మేనమామకొడుకు; చిన్నతనంనుంచీ స్వాతంత్ర్యం గలవాడు కనుకనే ఇంత చొరవగా మాట్లాడాడు. ఐనా అతనన్నది నిజమేనేమో? అనవసరంగా లేనికోపాన్ని తెచ్చిపెట్టుకోవటం దేనికి? అందుకనే నవ్వి ఊరుకుంది.

శ్రీధరం జేబులోంచి కొత్తగాకొన్న ఫౌంటిన్ పెన్‌ను తీసి. "సుశీ! యీ కలం బాగుందా?" అన్నాడు, కలాన్ని ఆమెకు అందిస్తూ.

ఆమె కలాన్ని అన్ని వైపులనుంచీ పరీక్షించి చూసి "ఓ... చాలా బాగుంది... ఎంతకు కొన్నావ్?" అంది.

"ఆరుం ముప్పావలా..."

"ఎందుకూ? మా వూళ్ళో దీన్ని రూపాయి పావలాకు ఇస్తారు... బలే టోపీలోపడ్డావే బావా!" అని సుశీల నవ్వసాగింది.

శ్రీధరం కోపాన్ని నటిస్తూ, "ఊరికనే ఇస్తున్నారు కదూ? ఇస్తే ఇచ్చారులే... నాది నా కివ్వు..." అన్నాడు

"నాకు కావాలి."

"ఎందుకూ? మీ ఆయనకు విరహలేఖలూ, ప్రేమలేఖలూ రాసుకుంటావా?"

సరసాన్ని భరించటం సుశీలకు మొదటినుంచీ అలవాటే. అందులోనూ చిన్నతనంనుంచీ యీ ఇంటికప్పు కింద తనతో ఆడుకుంటూ చదువుకుంటూన్న బావ దగ్గర తనకున్న స్వాతంత్ర్యంతోనే, "ఆ...ఆ... రాస్తాను" అని నవ్వసాగింది.

"అక్కర్లేదు... నాది నా కివ్వు."

"ఇవ్వను.."

శ్రీధరం కలాన్ని ఆమె చేతుల్లోంచి లాక్కోవాలని చేతుల్నిజాచాడు. ఆ చేతులకు అందకుండా పక్కమీదవాలి చేతుల్ని వెనక్కుజాచింది. శ్రీధరం ఆమె మీదిగా ఒరిగి కలంకోసం చెయ్యిజాపాడు. ఆమె ఇంకా సరసంతోనే నవ్వుతోంది. తన శరీరాన్ని బావ శరీరం తాకుతోందన్న దృష్టి కూడా ఆమెకు లేదు. కాని ఆ స్పర్శ శ్రీధరానికి ఎక్కడలేని ఉత్సాహాన్నీ ఇచ్చింది. తనను గట్టిగా ముద్దుపెట్టుకొనేదాకా, సుశీల తన స్థితిని గ్రహించుకోలేకపోయింది.

"ఛా...లే" మరి తన నోటి వెంట మాటల్ని రాకుండా శ్రీధరం తన చేతితో మూసివేశాడు. ఒక్కసారి అతని కళ్ళలోకి చూసింది. ఎంత ఆశతో, ఆకలితో అవి తనను అర్థిస్తున్నాయో అర్థమైంది. బావ ! ఒకే కంచంలో భోంచేసి, బావ పక్కలోనే పడుకొని రాత్రి చాలా పొద్దుపొయ్యేదాకా పిట్టకథల్ని చెప్పుకుంటూ గడిపిన చిన్ననాటి రోజుల్ని ఆమె మరిచిపోలేదు. కాని ఆ బావే యీనాడు వేరొక రూపంలో, వేరు గమ్యస్థానాల్నీ ఆశయాల్నీ పురస్కరించుకొని- తనతోడి స్నేహాన్ని కోరుతున్నాడు.

"అబ్బ- లే- ఎవరైనా వస్తారు" ఆ మాటల్ని ఎందుకు అన్నదో ఆమెకే తెలియదు.

పక్క గదిలో నిద్రిస్తూన్న తల్లిదండ్రులు చూసిపోతారేమోనన్న భయంవల్ల అల్లా అంటూన్నదనే దురభిప్రాయంతో, శ్రీధరం మెల్లిగా నవ్వి "తలుపులు గడియవేసే వచ్చాను" అన్నాడు తనెంత జాగ్రత్తపడ్డాడో తెలియజేస్తూ.

శ్రీధరం వింత ప్రవర్తనను ఆమె ఏవగించుకుంది. కాని అతను పట్టు విడవకుండా, తనకు యిష్టంలేని తావుల్లోకి బలవంతాన లాగుతూన్నట్టు, పెనుగులాడుతున్నాడు. ఆమె కూడా యీ అసందర్భపు వేళాకోళాన్ని తప్పించుకోవాలని ప్రయత్నించింది.

మౌనంతోనే కొంతసేపు పోరాడి ఓడిపోయింది. అలసిన ఆమె ముఖాన్ని బావ కోరి కోరి ముద్దు పెట్టుకుంటున్నాడు-

బావంటే ఆమెకు ఇష్టంలేకపోలేదు. కాని ఆమెలో జీర్ణించిన పాతివ్రత్యం ఒక మూల తిరుగుబాటు చేస్తోంది. ముఖం పక్కకు తిప్పి కిటికీలోంచి చూసింది. నింగిలో నక్షత్రాలనడుమ చంద్రుడు నవ్వుతూ, 'ఒక రాత్రి వృథాఅవుతోందిసుమా !' అంటున్నట్టు తోచింది. కోపంవల్ల యీ నెలరోజులూ కన్పించని కామం ధూమరూపాన ఆమె శరీరాన్నంతట్నీ ఆక్రమించసాగింది. బావ నోటినుంచివచ్చే సువాసనా, తనమీదుగా అతను పీల్చేగాలీ - ఆమెకు అనుభవించిన కొన్ని సౌఖ్యాల్ని జ్ఞాపకంచేస్తున్నయ్. ఒక మూల భయమూ సిగ్గూ కలిసి వెనుకంజ వేయిస్తున్నాయి. ఇదివరకు కాలేజీ స్టూడెంట్సు దగ్గర పనిచేసిన నిగ్రహం, సమయానికి ముఖం తప్పించింది.

ఆమె వాంఛ ఎలా వృద్ధిపొందిందోకాని - ఆమెకు ఇదివరలో గ్రహించలేని కొత్తదనం శ్రీధరంలో కన్పించింది. యవ్వనపు విలువను- ఆ రాత్రికీ, చంద్రుడికీ, చలిగాలికీ ఇప్పించగలుగుతూన్న బావ రసికత్వాన్ని ఆమె బాగా బోధపరచుకోగలిగింది. అతన్ని వారించటంకానీ, అతనిలోని దోషాన్ని గుర్తించటంకానీ ఆమె చెయ్యలేక పోయింది. యుద్ధంలో గెల్చి ఆక్రమించుకొన్న రాజ్యంలాగు- శ్రీధరం ఆ రాత్రి ఆమె శయ్యమీది సగభాగాన్ని ఆక్రమించుకోగలిగాడు-

తెల్లవారుఝామున చీకిచీకి విసిరి పారేసే మామిడి టెంకలాగు, పగిలిన సీసాముక్కల్ని గిరాటేసేమాదిరి ఆమెను ఒక పక్కకునెట్టి, శ్రీధరం వెనక్కయినా తిరిగి చూడకుండా గదితలుపు తీసి పిల్లిలాగు బైటికి జారేదాకా ఆమె తన స్థితిని గ్రహించుకోలేకపోయింది. చిరుచెమట్లు పోసిన ముఖాన్ని తుడుచుకుంటూ, రేగిన తలవెంట్రుకల్ని పైకి తోసుకుంటూ ఆమె లేచి కూర్చుంది. నలిగినచీరె, పరుపుమీద ముడుతలుపడ్డ దుప్పటీ ఆరాత్రి ఇంతవరకూ జరిగిన కథను చెప్తున్నయ్. మూలనున్న బెడ్‌లైట్ 'నేను అంతా చూస్తూనే ఉన్నాను' అంటోంది.

ఎంత అపచారం జరిగింది ! తన శరీరం మీద యీ రాత్రి రెండోవ్యక్తి అధికారాన్ని సంపాయించాడు. బావను తనెందుకు వారించలేకపోయింది? తన మౌనాన్ని అంగీకారంగా భావించబట్టే- అతను తనను అనుభవించగలిగాడు. అసలు అది తనక్కూడా ఆనందాన్నివ్వబట్టే- ఏ అవినీతి, ఏ భయమూ, ఏ పాతివ్రత్యమూ, ఏ నిగ్రహమూ, ఏ లోకమూ తనకు ఆ క్షణాల్లో గుర్తు రాలేదు. తన ఆదర్శాలన్నీ భగ్నమౌతున్నా ఎలా సహించగలిగిందో ఆమెకు అర్థమవలేదు.

తన భర్త పరస్త్రీ పాలయ్యాడని తనెంత ఈర్ష్య పడ్డది ! అతను తనను ప్రేమించటంలేదని అపోహపడి, అతనిమీద కత్తికట్టి రెక్కలు కట్టుకొని ఈ శాంతిమయ

ప్రదేశానికి వచ్చింది. కాని ఇక్కడే తనుకూడ కాలుజారింది. భర్త మీద తనకు ఇష్టంలేక కాదు, అతన్ని సాధించాలనీకాదు, పరపురుషుడితో తను ఆనందాన్ని అనుభవించాలనీకాదు- మరి ఏ యితర కారణమో తను జీవితాంతం వరకూ ఏకదీక్షగా ఆలోచించినా చెప్పలేదు ! భర్తకూడా ఇలాగే కాలుజారి ఉంటాడేమో?

తార, అహల్యలలాటి పతివ్రతలు ఎలా కాళ్ళు జారారో ఆమెకు జ్ఞాపకం వచ్చింది. మానవులు ఎలా కాళ్ళు జారుతారో కూడా ఆమెకు అర్థమైంది. ప్రతి తప్పుకూ శిక్ష అంటూ వుంటే - జీవితమంతా 'శిక్ష'లోనే గడపాలేమోననే అనుమానం కూడా ఆమెను బాధించింది.

ఏమైనా యీ ఇల్లు ఆమెకు ఒక్క క్షణంకూడా నివాసయోగ్యంగా తోచలేదు- తన శీలాన్ని బలిగొన్న కొంప !

తెల్లారగానే తండ్రితో, "నేను యీ మధ్యాహ్నం బండికి వెళ్తాను-" అంది.

"అంత తొందరేం?" అన్నాడు తండ్రి.

"ఆయనకు హెూటల్ తిండి పడదు-" ఇంకేమేమో కారణాల్ని చెప్పి ఒప్పించింది.

రైల్లో ఎక్కించేందుకు శ్రీధరం వచ్చాడు. ఫ్లాటుఫారం మీద ఒకమూల జేరాక "ఇంత తొందరగా వెళ్ళిపోతున్నావేం?" అన్నాడు.

'నిన్ను వశంచేసుకున్నాను- చూశావా' అన్నట్టు మెరుస్తూన్న అతని కళ్ళల్లోకి ఆమె చూడలేకపోయింది. ముఖం పక్కకుతిప్పి, "ఊరకనే-" అంది.

"నన్నుకూడా రమ్మంటావా?"

"ఒ-ద్దు"

"ఈమాట రాత్రి అనలేకపొయ్యావ్ !" విజయసూచకంగా నవ్వాడు. 'సుశీలా! నీ శీలం చెడింది సుమా !' అన్నట్టు చూసిన ఆ వాడిచూపులకు ఆమె అభిమానంతో కుంగిపోయింది. తప్పుచేశాక అందరూ వేలెత్తి హేళన చేసేవాళ్ళే కాబోలు! తనమీద ఒక్కరాత్రి పట్టు బలవంతాన, విధివశాన అధికారాన్ని సంపాయించినంత మాత్రంచేత, ఎంత గర్వంగా అవమానకరంగా మాట్లాడాడు ! తను అతని చరణదాసి అయినట్టు ఆ కంఠమే చెప్తోంది. కాని ఆమె రైలెక్కాక కూడా "మరిచిపోకండి-" అన్నాడు హేళనగా, 'నీలాంటిది నాకొక లెక్కా?' అన్నట్టు చూసి విషపునవ్వు నవ్వుతూ.

ఆమె ఇల్లు జేరేదాకా ఆ మాటలూ, ఆ నవ్వూ ఆమె చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉన్నయ్.

భర్త "అప్పుడే వచ్చావేం?" అన్నాడు మామూలు ధోరణిలో. తన తప్పు అతనిక్కూడా తెలిసిందేమోనని ఎంత బాధపడ్డది ! అంతరాత్మ ఎంతగా ఏడ్చింది !

తలవంచుకొనే సమాధానం చెప్పింది. "ఉండలేకపొయ్యాను- మీరు లేకపోతే-" మాట పూర్తికాకముందే అనురాగాన్ని సూచించే అతని చేతులు ఆమెను దగ్గరకు లాక్కున్నాయ్. ఎంతలో క్షమించాడు !

రాత్రి భోజనాలయ్యాక సుశీల గదిలో ప్రవేశిస్తూ, "వరలక్ష్మి ఊళ్ళోలేదా?" అంది.

"వాళ్ళు ఇల్లు మార్చారు-"

ఆమె ఆశ్చర్యపడి "ఎప్పుడూ?" అంది.

"నువ్వు వెళ్ళిన పది రోజులకు"

"ఎందుకనీ?"

ఈ ప్రశ్నకు భాస్కరం వెంటనే సమాధానం చెప్పక కొంచెం ఆగి, నీళ్ళు నములుతూ, "ఏమో" అన్నాడు.

"అబ్బ- చెప్పండి-" అని ఆమె సాగదీసింది. కొంతసేపు ఆమె చేత బతిమాలించుకొన్నాక, భాస్కరం మెల్లిగా "భర్త ఆమె మీద అనుమానపడి-" అని ఊరుకున్నాడు. ఆమె పకాలున నవ్వింది- తనకంతా అర్థమైనట్టు-

'ఆ అమాయకుడికి మనుషులు ఎందుకు తప్పులు చేస్తారో ఇంకా తెలియదు కాబోలు !' అనుకుంది. భర్తముఖంలోకి 'ఇంతేకద !' అన్నట్టు చూస్తూ.